క్లుప్తంగా

శాకంబరీదేవిగా అమ్మవారు



పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరిని ఆదివారం శాకంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయంలో అమ్మవారికి విశేషంగా అభిషేకాలు జరిగాయి. అనంతరం అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరీదేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు ముత్తేవి మాధవ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొగ్గరపు జాలయ్య, బి.సాయిబాబు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేణుకా పరమేశ్వరునికి అన్నాభిషేకం



పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని అంకమ్మ దేవస్థానంలో రేణుకా పరమేశ్వరునికి ఆదివారం ఘనంగా అన్నాభిషేకం చేశారు. తొలుత ఆలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. విజయవాడ వాస్తవ్యులు నాగమహేష్ దుర్గారాణి దంపతుల ఆధ్వర్యంలో స్వామికి అన్నాభిషేకం చేశారు. రుద్ర, శ్రీసూక్త నవగ్రహ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దేవి హోమం చేశారు. అన్నాభిషేకం అనంతరం అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వరదా అప్పారావు, కమిటీ సభ్యులు మేకా పేరయ్య, కాటూరి వెంకట మురళీకృష్ణ, కాట్రగడ్డ జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆషాఢ సారె సమర్పణ




పామర్రు: గ్రామంలో శ్రీ అంకమ్మ, కన్యకా పరమేశ్వరి అమ్మవార్లకు స్థానిక మహిళలు ఆషాఢ మాస సారెను ఆదివారం అందజేశారు. అంకమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘ మహిళలు ఆషాఢ సారెను తమ ఇళ్ల వద్ద నుంచి తీసుకువచ్చి కన్యకా పరమేశ్వరి ఆలయంలోని అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు కోటి విజయలక్ష్మి, మేకా లావణ్య, బొగ్గరపు సుభద్ర, బి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో వాతావరణ కాలుష్యం దూరం



పామర్రు: మొక్కలు పెంచడంతో వాతావరణ కాలుష్యం దూరమవుతుందని సర్పంచ్ కె.కస్తూరి అన్నారు. స్థానిక సచివాలయం -1 ప్రాంగణంలో ఆదివారం మొక్కలు నాటారు. సర్పంచ్ మాట్లాడుతూ మొక్కలు ఉన్నచోటు ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీలు తాడిశెట్టి శ్రీనివాసరావు, పి.రత్నకుమారి, కోఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, మండల ఆర్బీకే అధ్యక్షులు శ్రీనాథ్‌రెడ్డి, వార్డు మెంబర్లు కూసం సుబ్బారెడ్డి, లక్ష్మి, గ్రామ కార్యదర్శి సలీం తదితరులు పాల్గొన్నారు.

ఫాదర్‌లకు సత్కారం



గుడివాడ టౌన్: ప్రభువు సేవలో 25 సంవత్సరాలు పూర్తిచెయ్యడం అదృష్టంగా భావించాలని ఫాదర్ మైఖేల్ అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని మౌంట్ కర్మెల్ ఆర్‌సీఎం దేవాలయంలో 25 సంవత్సరాలు సేవ చేసిన గురువులను ఆదివారం సత్కరించారు. ఫాదర్ మందపాటి లూయిస్‌రాజ్, ఫాదర్ దాసి సురేష్, ఫాదర్ బొడ్డు ఆనంద్‌బాబులను చర్చి పాలకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిల్ అధ్యక్షుడు ఏలేటి విలియం జోషి, ఫాదర్ జాన్ హారీష్, కౌన్సిల్ సభ్యులు ఇంటి స్వామిదాసు, కారె శ్రీనివాసరావు, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుని ఆలయానికి విరాళం

భావదేవరపల్లి(నాగాయలంక): అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి అమెరికాలో నివసిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కట్టా అనూష, నిరోషా (విజయవాడ) సోదరీమణులు రూ.5,116 విరాళం అందించారు. వారి తండ్రి నాగోజీరావు జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని ఆదివారం అందజేశారు.

అధికారమంటే సేవ చేయడం

- పెత్తనం చెలాయించడం కాదని సీఎం జగన్ నిర్దేశించారు
- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

కాజ(మొవ్వ): అధికారమంటే పెత్తనం చెలాయించడం కాదని.. సేవ చేయడమేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తమకు నిర్దేశించారని.. వారి అడుగు జాడల్లోనే ముందుకు సాగుతున్నామని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఆదివారం మొవ్వ మండలం కాజలోని సచివాలయం-1లో పర్యటించారు. గడప గడపకూ వెళ్లి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకుంటూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులకు సూచనలిస్తూ ముందుకు సాగారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మంచి చేశాం.. చేస్తున్నాం కాబట్టే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్తున్నామన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో గత ప్రభుత్వం పెత్తందారీ విధానాన్ని ప్రవేశపెట్టి ప్రజలకు సంక్షేమ పథకాలను దూరం చేసిందని గుర్తు చేశారు. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టి నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తోందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర, సర్పంచ్ కొడాలి భవాని, ఎంపీటీసీ పేకేటి వెంకట లక్ష్మి, ఉపసర్పంచ్ మంద శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయులు, ఎంపీడీఓ సుధాప్రవీణ్, సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ జోగి రామచంద్రరావు తదితర నాయకులు పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్

లయన్స్ సేవలు అభినందనీయం

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

చల్లపల్లి: లయన్స్ క్లబ్ సేవా సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 210 దేశాల్లో లక్షా 40 వేల మంది సభ్యులతో విస్తృత సేవలు అందిస్తోందని లయన్స్ క్లబ్ పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ లింగం శివశంకర్ అన్నారు. ఆదివారం స్థానిక క్లబ్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. నూతన అధ్యక్షునిగా మోపిదేవి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా రాయపాటి రాధాకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథి శివశంకర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను వివరించారు. చల్లపల్లి శాఖ సేవలను ప్రశంసించారు. నూతన కార్యవర్గం క్లబ్ ఖ్యాతి ఇనుమడించేలా సేవలు అందించాలని కోరారు. సమాజంలో ఆర్థిక అభివృద్ధి సాధించిన ప్రతి ఒక్కరూ సమాజానికి సేవ చేయాలని కోరారు. మేము సేవ చేస్తాం నినాదంతో లయన్స్ క్లబ్ సభ్యులు ప్రపంచ దేశాల్లో అనేక సేవా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నారని తెలిపారు.
ఈ సందర్భంగా నూతన కార్యవర్గ తొలి సేవా కార్యక్రమంగా చల్లపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ద్వితీయ స్థానం సాధించిన ఏడుగురు విద్యార్థులకు నోట్ బుక్స్, గ్రామర్ బుక్స్, నగదు ప్రోత్సాహం అందించారు. దేవరకోట అగ్ని ప్రమాద బాధితునికి, ఐఐటీ టాపర్ విద్యార్థికి క్లబ్ సభ్యులు అన్నవరపు పాండురంగారావు ఆర్థిక సాయం చేశారు. మాజీ గవర్నర్ కంకణాల శ్రీనివాసరావు, మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు, వైవీసీ ప్రసాద్, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, పీఎస్ విజయబాబు, క్లబ్ పెద్దలు నర్రా సాయిబాబు, ముమ్మనేని రాజకుమార్, వరదా హరిగోపాల్, కస్తూరి ప్రసాద్, కోసూరు శివాజీ, ఏఎల్‌ఆర్‌కే ప్రసాద్, తగిరిశ సాంబశివరావు, అడపా గురవయ్య, ఎస్‌జీఏ బాషా, ఎంవీ కృష్ణారావు, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, ఏపీ చంద్రశేఖర్, గోళ్ల ద్రోణ పాల్గొన్నారు.



నూతన అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తున్న మోపిదేవి వెంకటేశ్వరరావు

మండవల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీటు



మండవల్లి: మండవల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి చలంశెట్టి యువసాయి ప్రదీప్ నూజివీడు ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించారు. సాయి ప్రదీప్ పదో తరగతి ఫలితాల్లో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), సర్పంచ్ మెండా ఝాన్సీ, వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, గ్రంథాలయాధికారి షేక్ పర్వీన ఆదివారం సాయి ప్రదీప్‌ను అభినందించారు.

ఈదురుగాలులకు కూలిన చెట్టు



కైకలూరు: ఈదురుగాలులకు కైకలూరు బస్టాండ్ వద్ద శనివారం అర్ధరాత్రి చెట్టు ఒక్కసారిగా కూలిపోయింది. బలమైన ఈదురుగాలులు వీయడంతో సమీపంలోని చెట్టు మొదలు వరకు విరిగి బస్టాండ్ మెట్ల వద్ద పడింది. ఆ సమయంలో ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఓ ద్విచక్రవాహనం, ఆటో స్వల్పంగా దెబ్బతిన్నాయి. కూలిన చెట్టును సిబ్బంది తొలగించారు.

విద్యార్థినులకు సన్మానం

చల్లపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థినులకు ఘన సన్మానం జరిగింది. ఘంటసాల జెడ్పీ హైస్కూల్‌లో టాపర్‌గా నిలిచి ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన షేక్ జాస్మిన్, కొత్తమాజేరు జెడ్పీ హైస్కూల్‌లో టాపర్‌గా నిలిచి ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన తెనాలి జెస్సికాలను స్థానిక సాయినగర్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ సత్కరించారు.

ఘనంగా రామలింగేశ్వరుడి కల్యాణం

పెనమలూరు: యనమలకుదురులో శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారికి కల్యాణం అత్యంత వైభవంగా చేశారు. మాసశివరాత్రి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం 5 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఉదయం 10 గంటలకు సహస్ర లింగార్చన నిర్వహించారు. స్వామివార్లకు ప్రత్యేకంగా అలంకరించి శివసాధంలో అశేష భక్తుల మధ్య స్వామివారికి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది.



స్వామివారికి కల్యాణం చేస్తున్న ఆలయ అర్చకులు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: కానూరు వద్ద బందరు రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు కావడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటమట అయ్యప్పనగర్‌కు చెందిన ఈదర కుసుమకుమారి ద్విచక్ర వాహనంపై విజయవాడకు వెళ్లి తిరిగి వస్తుండగా పాతచెక్‌పోస్టు సూపర్‌మార్కెట్ వద్దకు వచ్చిన సమయంలో వాహనాన్ని తప్పించపోయి అదుపుతప్పి ప్రమాదానికి గురై రోడ్డుపై పడిపోయింది. ఈ ఘటనలో ఆమె పళ్లు రెండు ఊడిపోయాయి. ఆమెను కానూరులో ఆస్పత్రిలో చికిత్సకు చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రకృతి వ్యవసాయం.. ప్రగతికి మార్గం

- బీజ, ఘన జీవామృతాలపై రైతులకు అవగాహన
- కైకలూరు నియోజకవర్గంలో 80 ఎకరాల్లో సాగు

కైకలూరు: ప్రకృతి వ్యవసాయం సాగుదారులకు ప్రగతి బాటగా మారుతోంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ సంయుక్తంగా రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. సేంద్రియ ఎరువులు, కషాయాలు, ద్రావణాలు తయారీ విధానంపై అవగాహన పెంచుతున్నారు. కైకలూరు నియోజకవర్గంలో 80 ఎకరాల్లో పూర్తిస్థాయి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. మరో 60 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరిస్తున్నారు. నియోజకవర్గంలో 600 మంది రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారు. నియోజకవర్గంలో వేమవరప్పాడు, కోరుకొల్లు, అల్లినగరం, పెరికేగూడెం గ్రామాల్లో సాగు జరుగుతోంది. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ గౌతంకుమార్ జీవామృతాల తయారీ విధానాలను వివరించారు.

బీజామృతం ఇలా చేయాలి

బీజామృత తయారీకి ఆవుపేడ 5 కేజీలు, ఆవు మూత్రం 5 లీటర్లు, సున్నం 50 గ్రాములు, పుట్టమట్టి పిడికెడు, నీరు 20 లీటర్లు సిద్ధం చేసుకోవాలి. ఒక మట్టి పాత్రలో 20 లీటర్ల నీరు తీసుకుని, పేడను గుడ్డలో మూటగట్టి, నీటిలో వేలాడదీయాలి. అందులో ఆవు మూత్రం, సున్నం కలపాలి. దీనిని 12 గంటల సమయం పాటు ఉంచాలి. రోజుకు రెండు పర్యాయాలు కర్రతో కలియతిప్పాలి.

ఇవీ ఉపయోగాలు

- బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవచ్చు
- విత్తడానికి సిద్ధంగా ఉన్న విత్తనాలపై ఈ మిశ్రమాన్ని చల్లాలి
- నీడలో ఆరబెట్టిన తర్వాత విత్తుకోవాలి. దీంతో విత్తనం బాగా మొలకెత్తుతుంది. విత్తనం నుంచి సంక్రమించే వ్యాధులను నియంత్రిస్తోంది.
- అరటి పిలకలు, చెరకు కణుపులు, వరి, ఉల్లి, మిరప, టమాటా, వంగ నార్లను బీజామృతాన్ని ముంచి నాటుకోవడంతో ఉపయోగం ఉంటోంది.



వేమవరప్పాడులో ద్రవ జీవామృతాన్ని తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఘన జీవామృతం..

ఘన జీవామృతం తయారీకి నాటు ఆవుపేడ 100 కిలోలు, బెల్లం 2 కేజీలు, నాటు ఆవు మూత్రం కావలిసినంత, పప్పు దినుసుల పిండి 2 కేజీలు, పొలం గట్టు మట్టి గుప్పెడు అవసరమవుతాయి. అన్ని పదార్థాలను కొద్దికొద్దిగా ఆవు మూత్రాన్ని చల్లుతూ కలపాలి. ఈ మిశ్రమాన్ని నీడలో పలుచగా పరిచి 7 రోజులు ఎండబెట్టాలి. ఎండిన తర్వాత పొడి చేసి గోనె సంచులలో నిల్వ చేసుకోవచ్చు. దీనిని 6 నెలల వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉంటోంది.

ఉపయోగాలివి

- 100 కేజీల ఘనజీవామృతాన్ని ఒక ఎకరం పొలానికి ఆఖరి దుక్కిలో వేసుకోవాలి
- 1, 2 నెలల తరువాత 100 కిలోల ఘన జీవామృతాన్ని ఒక ఎకరానికి పైపాటుగా సాళ్ల మధ్యలో వేసుకోవాలి
- ఘన జీవామృతంలో పంటకు అవసరమైన పోషకాహారాలు ఉంటాయి.
- ముడిపదార్థాలు అందుబాటులో లభిస్తాయి.

ద్రవ జీవామృతం

ద్రవ జీవామృత తయారీకి ఆవుపేడ 10 కేజీలు, ఆవు మూత్రం 10 లీటర్లు, నల్లబెల్లం లేదా చెరుకు రసం 2 కేజీలు, నీరు 200 లీటర్లు, పుట్టమట్టి, పొలంగట్టు మట్టి గుప్పెడు అవసరమవుతాయి. ఒక ప్లాస్టిక్ డ్రమ్ములో 200 లీటర్లు నీరు తీసుకోవాలి. దానికి 10 కేజీల ఆవుపేడ కలిపి, కర్రతో బాగా కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని మెత్తగా పొడి చేసి, బెల్లం, శనగపిండి కలపాలి. దానికి 10 లీటర్లు పశువుల మూత్రాన్ని, పిడికెడు మట్టిని కలిపి కర్రతో బాగా కలియబెట్టాలి. పాత్రపై గోనెసంచి కప్పి, ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సవ్య దిశలో కర్రతో కలియబెడుతూ ఉండాలి. 4 నుంచి 7 రోజుల తర్వాత పంటకు ఉపయోగించుకోవాలి.



కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామంలో బీజామృతాన్ని తయారు చేస్తూ..

అన్ని పంటలకు వినియోగించవచ్చు

- ద్రవ జీవామృతాన్ని అన్ని పంటలకు ఉపయోగించవచ్చు. ఇది పెరుగుదలకే కాకుండా చీడపీడలను దరిచేరనీయదు.
- పండ్ల తోటలకు, ప్రతీ చెట్టుకు 2–5 లీటర్ల ద్రవజీవామృతం భూమిపై చల్లాలి. చట్టు చుట్టూ చెట్టు నీడపడే పరధిలో చల్లుకోవాలి.
- భూమిలో తేమ ఉన్నప్పుడు మాత్రమే చల్లుకోవాలి.

ప్రకృతి వ్యవసాయం మేలు

మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ సంఘ నిర్వాహక ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్‌ఎఫ్) ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కలిగిస్తున్నాం. స్థానిక వ్యవసాయశాఖ ఏడీ గంగాధరరావు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

– గౌతంకుమార్, డిజిటల్ సీఆర్పీ, కైకలూరు

అలరించిన నాటిక ప్రదర్శనలు

గుడివాడ టౌన్: కళారంగాన్ని పోషించి ముందుకు తీసుకువెళ్లవలసిన అవసరం ఉందని స్పందన ఆర్ట్స్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ వల్లూరుపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, అధ్యక్షులు గవిర్నేని బాబూ శ్రీకర్ అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని జీవీ పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాలులో ఆదివారం స్పందన ఆర్ట్స్ ఆధ్వర్యాన నాటిక ప్రదర్శనలు జరిగాయి. హైదరాబాద్‌కు చెందిన కళాంజలి ఆధ్వర్యంలో రైతేరాజు, చిలకలూరి పేటకు చెందిన ది అమెచ్యూర్ డెమోక్రటిక్ అసోసియేషన్ వారు ఆకలితో సరదాగా నాటిక ప్రదర్శనలు జరిగాయి. నాటికలు ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా వల్లూరిపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ పూర్వం నాటిక ప్రదర్శనలు టికెట్లపై నిర్వహించేవారని అప్పుడు ప్రజల ఆదరణ ఉండేదన్నారు. స్టేజి నాటికల్లో ఉన్న నీతియుక్తమైన మాధుర్యం ప్రజలకు చేరువ చేసేందుకు స్పందన ఆర్ట్స్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్పందన ఆర్ట్స్ సభ్యులు డాక్టర్ కేవీఎస్‌బీ శర్మ, మట్టా రాజా, పీవీ సత్యనారాయణ, శీరం శ్రీనివాసరావు, యార్లగడ్డ సత్యనారాయణ, కొనకళ్ల సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.



రైతేరాజు నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

వీధుల్లో శునకాలు, వరాహాల సంచారం



మండవల్లిలో ఓ వీధిలో కుక్కలు



గ్రామంలో తిరుగుతున్న వరాహాలు

మండవల్లి: మండవల్లిలో వీధి కుక్కల సంచారం అధికంగా ఉంది. వాహనాలు వెళుతుంటే వాటి వెంట పరుగు పెడుతుండటంతో వాహనచోదకులు ఎక్కడ కరుస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో బయటకు రావడానికి భయపడుతున్నారు. వరాహాలు కూడా గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ తిరుగుతుండటంతో, మెదడు వాపు వంటి వ్యాధులు సోకుతాయేమోనని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పుస్తకావిష్కరణ

పామర్రు: సమరసత ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పామర్రు విభాగ్ ఆధ్వర్యాన ఆదివారం స్థానిక హితమ్ స్కూల్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ రంగనాథ్‌మిశ్రా నివేదిక అంశాలతో కూడిన దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలా? పర్యవసానాలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. పామర్రు సమరసత కన్వీనర్ పొనుగుమాటి లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమవేదిక రాష్ట్ర కార్యదర్శి జాషువా, సమరసత జిల్లా ప్రతినిధి అరిగల బాలుడు, మానవత రీజియన్ చైర్మన్ పీఎంఎస్‌ప్రసాద్, కళా పరిషత్ అధ్యక్షులు ఎన్.త్రివిక్రమరావు, వీహెచ్‌పీ కన్వీనర్ ఆళ్ల రామిరెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చ ప్రెసిడెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీ

గుడివాడ టౌన్: గుడివాడలో ఆదివారం క్రైస్తవ సంఘాల పాస్టర్లు శాంతి ర్యాలీ చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఏలూరు రోడ్‌లోని మౌంట్ కర్మెల్ ఆర్‌సీఎం చర్చి నుంచి నెహ్రూచౌక్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్యదేశంలో ఒక వర్గానికి చెందిన వారిపై దాడులు నిర్వహించడం దారుణమన్నారు. కార్యక్రమంలో బిషప్ అప్పికట్ల జాషువా, ఆర్‌సీఎం ఫాదర్ మైఖేల్, వివిధ సంఘాలకు చెందిన పాస్టర్లు మందా సువర్ణబాబు, విక్టర్ పాల్, బి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రోటరీ ఆధ్వర్యంలో 200 మందికి వైద్యసేవలు

ఉయ్యూరు: మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. రోటరీ హాస్పిటల్, అను హాస్పిటల్స్, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో ఎంపీపీ పాఠశాల ఆవరణలో గొంతు, క్యాన్సర్, ఎముకలు, నరాలు, దంత వైద్య సేవలు అందించారు. 200 మందికి ఉచితంగా అన్ని పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసీజీ, ఎకో, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు జరిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ త్రిపురం లక్ష్మి, ఎంపీటీసీ గుంటక నాగిరెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు పీహెచ్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి నాగసుబ్రమణ్యం, కేసీపీ జీఎంలు వీవీ పున్నారావు, సీకే వసంతరావు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ అనీస్ తదితరులు పాల్గొన్నారు.



దంత పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

బోర్ ఏర్పాటు

ముదినేపల్లి రూరల్: మంచినీటి కోసం బోర్ పంపు ఏర్పాటు చేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా కోఆప్షన్ సభ్యులు షేక్ అల్లాబక్షు కైకలూరు రోడ్‌లోని హైస్కూల్ వద్ద సొంత నిధులతో ఆదివారం బోర్ పంపును ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ డైరెక్టర్ గంట సంధ్య, వైస్ ఎంపీపీ రాధా, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



హైస్కూల్ వద్ద బోర్ ఏర్పాటు చేసిన దృశ్యం

పాఠశాల నిర్మాణానికి విలువైన స్థలం వితరణ

కోడూరు: వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు దాతృత్వాన్ని చాటుకున్నారు. మందపాకలలో ప్రభుత్వ పాఠశాలకు పక్కా భవనం లేకపోవడంతో ప్రైవేట్ సంస్థకు చెందిన భవనంలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై విద్యా శాఖ అధికారులు గతంలో ప్రభుత్వానికి నివేదించగా పాఠశాల భవనాల నిర్మాణాలకు ఆమోదం లభించింది. దీనికి ప్రభుత్వ స్థలం లేకపోవడంతో నరసింహారావు తన సొంత స్థలాన్ని భవనాల నిర్మాణానికి ఇవ్వడానికి ముందుకొచ్చారు.